

# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## వైజయంతిమాల
## ఎందుకు తల్లికి దూరమైంది?
### ( విజయచిత్ర 1983 సెప్టెంబర్ నుంచీ పునర్ముద్రణ)



**"పాపా నీకు ఎవరంటే ఇష్టం?** అమ్మంటే ఇష్టమా, నాన్నంటేనా?"

సాధారణంగా ప్రతి కుటుంబంలోనూ తల్లిదండ్రులు తమ పిల్లల్ని తరచు సరదాగా అడిగే ప్రశ్నే ఇది. అలా అడగ్గానే ఆ పిల్లలు ధర్మసంకటంలో పడతారు.ఒకసారి తల్లంటే ఇష్టమనీ, మరోసారి తండ్రంటే ఇష్టమని చెబుతారు. అయితే ఆ సమయంలో ఎవరి దగ్గర చాక్లెట్లు అవీ వున్నాయో వారే తమకి ఇష్టమని పిల్లలు చెప్పడం సహజం.

తల్లిదండ్రులు ఇటువంటి ప్రశ్న అడిగినప్పుడు ఇద్దరూ ఇష్టమేనని చెప్పే పిల్లలూ అరుదు. అసలీ ప్రశ్న అడగని తల్లిదండ్రులూ వుండరు.

అయితే జ్ఞానం తెలిసిన ఒకమ్మాయిని ఒక ఉన్నత న్యాయస్థానంలోని న్యాయమూర్తి ఈ ప్రశ్న అడిగితే ఆ బాలికది ఎంతటి సంకట స్థితి.

ప్రముఖనటి వైజంతిమాల తన బాల్యంలో సరిగ్గా ఇటువంటి చిక్కు సమస్యని ఎదుర్కోవలసి వచ్చింది.

మైనర్ బాలిక అయిన వైజంతిమాల తనతోనే వుండాలని తల్లి వసుంధరాదేవి కోర్టులో అర్జీ పెట్టుకుంది. వైజయంతి తనతోనే వుండాలని ఆమె తండ్రి ఎమ్ . టి. రామన్ కోర్టులో వాదించారు.

వసుంధరాదేవి తల్లి, యదుగిరి అమ్మాళ్ తన కుమార్తెకి వ్యతిరేకంగా తన అల్లుడి పక్షం వహించింది.

మొత్తం మీద వైజయంతిమాల ఎవరితో వుండాలన్న వీరి కుటుంబ సమస్య కోర్టుకి ఎక్కింది.

*వైజయంతిమాల కుటుంబ కథ*

వైజయంతిమాల పూర్వీకులు అలనాటి మైసూరు రాజ్యంలోని మాండ్యానుండి 65 సంవత్సరాల క్రితం మద్రాసుకు తరలి వచ్చారు. వైజయంతిమాల మామ్మగారైన యదుగిరి అమ్మాళ్ భర్త ఎమ్.ఎన్.శ్రీనివాసన్ ఇంపీరియల్ బ్యాంకులో గుమస్తాగా వుండేవారు. సంగీత కచేరీలు, రంగస్థల నాటకాలపట్ల ప్రీతిగల ఆయన సుగుణ విలాస సభ పేరిట, ఒక సాంస్కృతిక సంస్థ ఆరంభించి నాటకాలలోనూ పాల్గొంటుండేవారు. ఆ తర్వాత 'శ్రీమతి పరిణయం', 'మైనర్ రాజమణి', 'విష్ణులీల ' 'బాలామణి ', 'అదృష్టం ' మొదలైన తమిళ చిత్రాల్లోనూ చిన్న చిన్న పాత్రల్లో కనిపించారు.

ఈ దంపతులకు 1918లో వసుంధరాదేవి పుట్టింది. బాల్యం నుంచి మంచి గాయనిగా పేరు పొందిన వసుంధర కొన్ని గ్రామఫోన్ రికార్డులు ఇచ్చింది. అయితే ఆమెకు బాగా పేరు తెచ్చి పెట్టినది – మీరా కథ 'గ్రామ్ ఫోన్ నాటకం '

షైనింగ్ స్టార్స్ వారి 'మీరాకథ' నాటకం రికార్డింగ్‌లో శ్రీనివాసన్ పాల్గొంటూ తన కుమార్తె వసుంధరాదేవిని మీరా పాత్రకు ఎంపిక చేశారు. ఆ రికార్డు పలువురి దృష్టినీ ఆకట్టుకున్నది. 'వసుంధరాదేవి ఎవరు?' అని పలువురు ప్రశ్నించేలా చేసిందా రికార్డు.

అప్పటికే వసుంధరకి ఎమ్.టి. రామన్‌తో వివాహమైంది. అతడికి వసుంధరాదేవి ఇలా గ్రామ్ ఫోన్ రికార్డులూ అవీ ఇవ్వడం నచ్చలేదు, ఆ సమయంలో యదుగిరి అమ్మాళ్ కూతురిని సమర్ధించింది. భార్యాభర్తల మధ్య ఆ గొడవ పెద్దది కాకుండా అప్పటికి నిరోధించబడింది.

అప్పటికే, తన పదిహేనవ ఏట వైజయంతిమాలని కన్నది వసుంధరాదేవి.

*మైసూరు యువరాజాతో పరిచయం.*

క్రమక్రమంగా వసుంధరాదేవి గ్రామ్ ఫోన్ రికార్డులు ఇవ్వడంతోపాటు కచ్చేరీలలో పాల్గొనడం కూడా చేసింది. రామన్ పి. డబ్ల్యు. డిలో డ్రాట్స్‌మన్. అతడు స్వతహాగా సాధు స్వభావం గలవాడు. భార్యని ఆపడం అతడి తరం కాలేదు.

1939లో వసుంధరకి మద్రాసులోని సంగీత విద్వత్ సభలో పాడే అవకాశం లభించింది. ఆ కచ్చేరీకి మైసూరు యువరాజా వచ్చారు. ఆయనకి వసుంధర పాట నచ్చింది. ఆమెను మైసూరు సంస్థానంలో పాడవలసిందిగా ఆహ్వానించారు. మహారాజుల ప్రాపకం అనగానే సంబరపడి యదుగిరి అమ్మాళ్ వసుంధరని మైసూరుకి పంపించారు. మహారాజా సమక్షంలో వసుంధరాదేవి పాడడమూ, ఆ పాటను అందరూ మెచ్చుకోవడమూ జరిగాయి.

సరిగ్గా ఆ సమయంలోనే వసుంధరా దేవిని మరో అదృష్టం వెతుక్కుంటూ వచ్చింది. మైసూరు యువరాజు విదేశాలకు వెళుతూ వసుంధరాదేవి బృందాన్ని కూడా అక్కడ కచ్చేరీలు ఇవ్వడానికి ఆహ్వానించారు.

*యువరాజుతో విదేశీ ప్రయాణం.*

విదేశీ ప్రయాణమా.. అంగీకరించటమా? మానటమా? అన్న సందేహంలో పడింది వసుంధరాదేవి. ఆమె తండ్రికి ఈ ప్రయాణం ఇష్టంలేదు. భర్త ఈ విషయం పట్టించుకోనట్టే వుండిపోయాడు. యదుగిరి అమ్మాళ్ మాత్రం "మనవంటి సామాన్య కుటుంబీకులకు విదేశాలకు ఆహ్వానం రావడం అంటే సామాన్యమైన విషయమా? అందులోనూ ఒక యువరాజుతో పాటుగా ఆహ్వానం రావడం అంటే ఎంత గొప్ప. ఈ అవకాశం విడిచిపెట్టకు" అంది.

యువరాజుతో పాటుగా వసుంధర, యదుగిరి అమ్మాళ్, భర్త రామన్, అప్పటికి ఆరేళ్ళ వయసున్న వైజయంతిమాల విదేశాలకు ప్రయాణమయ్యారు. పోప్ ఎదుట, యూరప్‌లోని కొన్ని నగరాలలోనూ వసుంధరాదేవి కచ్చేరీలు చేశారు.

వారు లండన్ నగరంలోని డెన్‌హోమ్ స్టూడియో సందర్శించినప్పుడు ప్రపంచ ప్రఖ్యాతి పొందిన అలెగ్జాండర్ గోర్డా వైజయంతి మాలను చూసి 'ఈ పాపవి చక్కటి కళ్ళు. మంచి నటిగా మలచవచ్చును. ఇక్కడే విడిచి వెళతారా ' అని నవ్వుతూ అన్నారట.

అప్పటి నుంచి వసుంధరాదేవి మనసులో తన కుమార్తెను నటిని చెయ్యాలన్న కోరిక బలంగా ఏర్పడింది.

చలన చిత్రాల్లో వసుంధరాదేవి

'మీరా' గ్రామఫోన్ నాటకంలో పాల్గొన్నప్పటి నుంచి వసుంధరాదేవిని సినిమాల్లో నటింపజేయాలని కొందరు నిర్మాతలు ప్రయత్నించారు. తను కచ్చేరీలు చేయడమే భర్తకి, అత్తమామలకి కోపం తెప్పించింది. ఇక సినిమాల్లో నటించడమే అని వెనుకంజ వేసింది వసుంధరాదేవి.

కాని ఆమెకు ధైర్యం నూరిపోసి ఆమెను సినిమాల్లో నటింపజేసింది యదుగిరి అమ్మాళ్. 'ఋష్యశృంగ' చిత్రంతో ప్రారంభమైన వసుంధర ఆ తర్వాత 'మంగమ్మ శపథం', ఉదయనన్', 'నాట్యరాణి' చిత్రాలతో నటిగా గుర్తింపు పొందింది.

***వైజయంతి భరత నాట్య ప్రదర్శన.***

అయితే ఆమె వైజయంతిని నటిని చెయ్యాలన్న కోరికను మాత్రం మరచిపోలేదు. బాల్యంలోనే వైజయంతికి పాట, నాట్యం చెప్పించి కళల పట్ల అభిరుచి ఏర్పరిచింది. వళువూర్ రామయ్య పిళ్ళై వద్ద వైజయంతికి భరతనాట్యం చెప్పించి 1946లో తమ ఇంట్లోనే పలువురు పెద్దల ఎదుట అట్టహాసంగా 'అరంగ్రేటం' జరిపించింది.

తల్లిని మించిన కుమార్తె అని పలువురు మెచ్చుకున్న తర్వాత వైజయంతి చేత భరతనాట్య ప్రదర్శనలు విరివిగా చేయిస్తూ ఆ కార్యక్రమాల్లో తన మధురకంఠ స్వరంతో వసుంధర పాడేది.

ఇది ఇలా ఉండగా సినిమాల్లో నటించడం వల్ల పేరు, డబ్బు కూడా వచ్చేసరికి వసుంధరాదేవికి స్వేచ్ఛ లభించినట్లయింది. అంతవరకు తల్లి చెప్పినట్లుగా నడిచిన వసుంధరాదేవి తల్లి అదుపాజ్ఞల్లోంచి బయటపడి తన మనస్సుకు తోచింది చెయ్యడం ప్రారంభించింది. ఇందువల్ల యదుగిరి అమ్మాళ్‌కీ వసుంధరకి మధ్య ద్వేషం రగులుకుంది. వసుంధర భర్త రామన్ వారిద్దరినీ సమాధానపరచలేకపోయేవాడు.

***వసుంధర స్వీయ చిత్ర నిర్మాణం***

కుటుంబంలో కలహం రగులుకుంటూ ఉండగానే వసుంధరాదేవి స్వంతంగా 'దీపావళి' పేరిట ఒక హిందీ చిత్రాన్ని బొంబాయిలో నిర్మించడానికి సన్నాహాలు చేసింది. యదుగిరి అమ్మాళ్ ఈ చిత్ర నిర్మాణానికి తీవ్రంగా అభ్యంతరం తెలియజేసింది. అందులోను వారికి బాగా తెలిసిన ఒక వ్యక్తితో వసుంధర ఆ చిత్ర నిర్మాణం చేపట్టడం ఆమెకు నచ్చలేదు. వసుంధరాదేవి తన తల్లి మాటను నిర్లక్ష్యం చేసి బొంబాయికి ప్రయాణమయింది.

***వైజయంతి గురించి యదుగిరి అమ్మాళ్ నిర్ణయం.***

ఇక వైజయంతి వసుంధరతో ఉంటే ఆమె భవిష్యత్తు నాశనమవుతుందని యదుగిరి, రామన్‌లు తీర్మానించారు. అందుకని వారు వసుంధరకు చెందిన ఆ ఇల్లు విడిచి మరో ఇల్లు తీసుకుని ఉండడం ప్రారంభించారు.

ఇది తెలిసిన వసుంధర వెంటనే బొంబాయి నుంచి మద్రాసు వచ్చింది. నేరుగా తన భర్త, తల్లి అద్దెకున్న ఇంటికి వెళ్ళి వైజయంతిని తనతో పంపమని కోరింది. కానీ వారు 'ససేమిరా' పంపమన్నారు.

వసుంధరాదేవి తన కుమార్తెను తనవద్దకు రప్పించుకోవడానికి చేసిన ప్రయత్నాలు ఏవీ ఫలించలేదు. వైజయంతిని తన వద్దకు తెప్పించుకునేందుకు ఆమె చట్టాన్ని ఆశ్రయించక తప్పలేదు.

***భర్త, తల్లిపై వసుంధరాదేవి పెట్టిన కేసు.***

1949 ఆగస్ట్ నెలలో వసుంధరాదేవి తన కుమార్తె, మైనర్ అయిన వైజయంతిమాలను, ఆమెకు చెందిన ఆస్థిని తనకు అప్పగించవలసిందిగా తన భర్త రామన్, తల్లి యదుగిరి అమ్మాళ్‌ల పైన మద్రాసు హైకోర్టులో అర్జీ దాఖలు చేసింది.

వసుంధరాదేవి తన ఫిర్యాదులో ఏప్రిల్ 49లోనే తన భర్త, తల్లి తన కుమార్తెను అపహరించుకుపోయి విడిగా ఉంటున్నారని తెలియజేసింది.

అయితే రామన్ – తన కుమార్తెకు తానే సరైన గార్డియన్ అనీ సినిమాల్లో వేషాలేస్తూ ఊళ్ళు తిరిగే తల్లి కాదనీ, ఇక వైజయంతి ఆదాయాన్ని ఆమె నాట్యం నేర్చుకోవడానికే ఖర్చు చేస్తున్నామని ఆ అభియోగానికి సమాధానం చెప్పాడు.

హైకోర్టు న్యాయమూర్తి రాజగోపాలన్ కేసు విచారణకు పంపి, కేసు కేసు ముగిసేవరకు ప్రతి నెల 5వతేదీలోగా వైజయంతిమాల రాబడి, ఖర్చు, లెక్కలు, ఆభరణాలు కోర్టులో దాఖలు చెయ్యాలని ఒక 'మధ్యంతర తీర్పు'ను ఇచ్చారు.

***కేసు విచారణ – తీర్పు***

1950 ఏప్రిల్ 12, 13, 14 తేదీల్లో మద్రాసు హైకోర్టులో న్యాయమూర్తి కృష్ణస్వామి నాయుడు సమక్షంలో ఈ కేసు విచారణ ప్రారంభమైంది. వసుంధర, రామన్, యదుగిరి అమ్మాళ్‌లను ప్రశ్నించిన తర్వాత న్యాయమూర్తి చివరి రోజు ఈ విధంగా తీర్పు ఇచ్చారు.

"ఎమ్. టి. రామన్‌కి నిర్వహణా బాధ్యత తెలియనందున వైజయంతిమాల మేజర్ అయ్యే వరకు ఆమె ఆస్థి నిర్వహణ భారాన్ని చూసే సంరక్షకుడిగా న్యాయవాది ఎమ్. సుబ్రహ్మణ్య మొదలియార్‌ను నియమిస్తున్నాను. అంతవరకు వైజయంతిమాలకు గార్డియన్‌గా రామన్ ఉంటారు. ఈలోపల వైజయంతిమాలకు పెళ్ళి చేయదలచుకుంటే మాత్రం అందుకు కోర్టు అనుమతి పొందాలి.

"వసుంధర సంగీతంలోనూ, సినిమాల్లోను బాగా అనుభవం వున్నవారు. అందువల్ల వైజయంతిమాల నాట్యప్రదర్శనలకు ఒప్పందాలు చేసుకునే ముందు రామన్ తరపువారు ఆమె సలహాలు కూడా తీసుకోవడం మంచిది. ఆమె తన కుమార్తెను ఏ సమయంలో ఎప్పుడు చూడాలన్నా అందుకు తగ్గ ఏర్పాట్లు రామన్ చెయ్యాలి. వైజయంతిమాలను చూసుకునేందుకు కుటుంబ ఖర్చు 750 రూపాయలవరకు అనుమతించబడింది."

ఈ తీర్పు తర్వాత వసుంధరాదేవి ముందుగా భర్తకు తెలియబరిచి మే 5న తన కుమార్తెను చాలాకాలం తర్వాత కలుసుకున్నది. తల్లీ కూతుళ్ళిద్దరూ ఎటువంటి అరమరికలూ లేకుండా మూడుగంటల సేపు సంతోషంగా గడిపారు. ఆ సమయంలో రామన్ అక్కడ లేడు. అయితే ఈ కేసు అంతటితో ఆగలేదు.

***వైజయంతి తండ్రి అప్పీల్***

తన కుమార్తెకు మూడో మనిషిని ఆస్థికి గార్డియన్‌గా నియమించడం పట్ల తన అధిక్షేపాన్ని తెలియజేశారు రామన్. తననే అన్ని హక్కులు గల గార్డియన్‌గా నియమించాలని ఆయన అప్పీల్ చేసుకున్నారు.

అయితే వసుంధరాదేవి ఇందుకు విరుద్ధంగా తన భర్త రామన్ అసలు గార్డియన్‌గా ఉండడానికి తగడనీ, మైనర్ కుమార్తె సంరక్షణ భారం తల్లిగా తను వహించడమే సరైనదని పై అప్పీల్ చేశారు.

ఈ కేసు మే 10, 1950న విచారణకు తీసుకోబడింది.

కానీ హైకోర్టు వేసవి సెలవుల మూలంగా కేసు వాయిదా పడింది వాయిదా వేసేముందు వైజయంతిమాల నాట్య ప్రదర్శనల ఒప్పందం రామన్ చెయ్యవచ్చుననీ ఆ ప్రదర్శనలకు ఉన్న ఊళ్ళో పదిహేనువందలు, బయటి ఊళ్ళల్లో

రెండువేలు వసూలు చేయాలనీ, అయితే ఈ విషయాలను ఆస్థికి గార్డియన్ అయిన సుబ్రహ్మణ్య మొదలియార్‌తో కలిసి ఆలోచించాలనీ, సొమ్ము ఆయనకివ్వాలనీ, ఒక 'మధ్యంతర తీర్పు' ఇవ్వబడింది.

***కేసులో తిరకాసు.***

అప్పటికి వైజయంతి కూడా చిత్రాల్లో నటించడం ప్రారంభించింది. ఎ.వి.ఎమ్మ్ వారి 'వాళ్కై' (జీవితం) చిత్రంలో నటిస్తున్నందుకు వైజయంతికి చెందవలసిన సొమ్ము, ఆమె ఆస్థికి గార్డియన్ అయినతనకు పంపాలని, ఆ చిత్ర నిర్మాత ఎ.వి.మెయ్యప్ప చెట్టియార్‌కు నోటీస్ పంపారు సుబ్రహ్మణ్య మొదలియార్.

అయితే వైజయంతి అప్పటికే తనకు రావలసిన దానికన్నా ఎక్కువగానే తీసుకున్నదనీ అందువల్ల ఇక ఇవ్వడానికి ఏమీ లేదనీ ఎ.వి.ఎమ్ వారు ఆ న్యాయవాదికి తెలియజేశారు.

వెంటనే సుబ్రహ్మణ్య మొదలియార్ 'తనకు తెలియకుండా వైజయంతి ధనాన్ని ఆమె తండ్రి తరపు వారు తీసుకున్నారనీ ఇది చట్టప్రకారం నేరమనీ' కోర్టువారికి ఫిర్యాదు చేశారు. వైజయంతిమాలకు చెందవలసిన సొమ్ము తనకు అప్పగించాలని ఆయన వాదన.

జస్టిస్ ఎ.ఎస్.పి.అయ్యర్ విచారణ జరిపి ఎ.వి.ఎమ్ వారు వైజయంతి పారితోషికం నెలకు పదిహేనువందల చొప్పున జీతంగా ఆ సొమ్ము గార్డియన్‌కు అందచేయాలనీ, కారు అలవెన్సు క్రింద రామన్‌కు వంద రూపాయలు ఇప్పించాలనీ ఉత్తర్వు ఇస్తూ, వైజయంతిమాల ఆస్థికి ప్రత్యేకంగా గార్డియన్ నియామకం అనవసరమని తీర్పు యిచ్చారు.

వేసవి సెలవుల తర్వాత రామన్, వసుంధరాదేవిలు పెట్టుకున్న కేసు హైకోర్టులో విచారణకు వచ్చింది. వసుంధరాదేవి అర్జీని త్రోసి పుచ్చి, రామన్ అప్పీల్‌ను విచారణకు స్వీకరించి సెప్టెంబర్ 20న ఇలా తీర్పునిచ్చారు.

"వైజయంతిమాలకు ఇక అన్ని విషయాలలో తండ్రి రామన్ గార్డియన్‌గా ఉంటారు. ఇంతవరకు ఉన్న సుబ్రహ్మణ్యమొదలియార్ ఇక ఆ బాధ్యత నుంచి తప్పుకుంటారు. తండ్రి రామన్‌తోపాటుగా తల్లి వసుంధరాదేవికి కూడా గార్డియన్‌గా ఉండడానికి అర్హత వుంది. ఇది నిజానికి భార్యాభర్తల మధ్య ఒకరంటే ఒకరికి పడక ఏర్పడిన ఒక కుటుంబ సమస్య. ఈ కారణంగా కోర్టుకు ఎక్కడం జరిగిందే తప్ప మైనర్ బాలిక కోసం కాదు."

ఈ తీర్పు తర్వాత యదుగిరి అమ్మాళ్ చెప్పిన ప్రకారమే వైజయంతిమాల నటిగా సినిమాల్లో బాగా పేరు తెచ్చుకున్నది. కానీ వసుంధరాదేవి మరి ఈ కేసువల్లనో, ఇతర కారణాలవలల్నో ఆమె ప్రారంభించిన 'దీపావళి' చిత్రం సగంలోనే ఆగిపోయింది. ఆమెకు వ్యక్తిగతంగా అనేక కష్టాలు, అధిక ధన నష్టం ఏర్పడ్డాయి. కుటుంబ వివాదంవల్ల, ఈ కేసువల్ల ఆమె మానసికంగా కూడా కృంగి కృశించిపోయింది.

ఆ స్థితిలో ఆమెపై సానుభూతితో జెమినీ వాసన్ ఎలాగైనా ఆమెను ఆమెకుటుంబాన్ని ఏకం చేసి వారు సంతోషంగా కలసి మెలిసి జీవించేలా చెయ్యాలని అనుకున్నారు.

అందుకే ఆయన అప్పట్లో తాము తలపెట్టిన 'ఇరుంబుత్తిరై' చిత్రంలో వసుంధరాదేవిని, వైజయంతిమాలని తల్లికూతుళ్ళుగా నటింపజేసి వారి మధ్య ఏర్పడిన 'ఇనుప తెర'ని ఛేదించడానికి ప్రయత్నించారు.

కానీ ఆ ప్రయత్నాలేవీ ఫలించలేదు.

వైజయంతిమాల తండ్రి రామన్ ఆ తర్వాత కొంత కాలానికి మరణించారు.

వసుంధరాదేవి రంగరాజన్ అనే బంధువును పునర్వివాహం చేసుకున్నది. వారికి కవల పిల్లలు.

హిందీ చిత్రాల ద్వారా వైజయంతిమాల అఖిల భారత తారగా ఖ్యాతి గడించింది. బొంబాయిలో ఆమెకు డాక్టర్ బాలితో పరిచయమవడం, ఆ పరిచయం ప్రణయంగా మారి వారి వివాహానికి దారి తీయడం జరిగాయి.

వివాహమైన తర్వాత వైజయంతిమాల చలన చిత్రాలలో నటించడం విరమించుకుని మద్రాసులో నివాసం ఏర్పరచుకున్నది.

వసుంధరాదేవి కూడా రెండో భర్త రంగరాజన్‌తోపాటుగా మద్రాసులోనే ఓ మారుమూల ప్రాంతంలో అద్దె ఇంట్లో ఉంటున్నది కానీ..

'ఆ పాప తనకే చెందాలని కోర్టుకెక్కిన ' తన తల్లికి దూరంగానే ఉంటోంది వైజయంతిమాల.

Post your comments